సంక్షేమ పథకం అందని కుటుంబం లేదు

- పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



స్వయం సహాయక సంఘం సభ్యులకు రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో సంక్షేమ పథకం అందని కుటుంబం లేదని, మానవీయ కోణంలో ఆలోచించి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌కే పురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'తెలంగాణ సంక్షేమంలో స్వర్ణయుగం'అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్ల పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో ఆసరా పథకానికి ప్రభుత్వం దాదాపు రూ. 58,600 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ సంవత్సరం దళిత బంధు కోసం రూ, 1700 కోట్లు కేటాయించిందన్నారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని రూ. 12 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు.ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లకు సంబంధించి 1000 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచామన్నారు. ఈ సందర్భంగా సరూర్ నగర్ స్వయం సహాయక సంఘానికి రూ. కోటి 25 లక్షల రుణాల చెక్కును అందజేశారు. 31 మందికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దయానంద్ గుప్తా, యెగ్గెం మల్లేశం, రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, కందుకూరు జెడ్పీటీసీ జంగారెడ్డి,ఆర్డీఓ సూరజ్ కుమార్, జోనల్ కమిషనర్ పంకజ, తహసీల్దార్ జయశ్రీ, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ దితరులు పాల్గొన్నారు.

లోక్అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి

రంగారెడ్డి కోర్టులు: జాతీయ లోక్అదాలత్ సందర్భంగా శనివారం జరగబోయే లోక్అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ సంవత్సరం నిర్వహించిన మొదటి జాతీయ లోక్అదాలత్‌లో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. అదే స్ఫూర్తితో శనివారం కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించే 2వ జాతీయ లోక్అదాలత్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 29 ప్రత్యేక లోక్అదాలత్ ధర్మాసనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి పట్టాభి రామారావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

ముంపు సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ముంపు సమస్యల పరిష్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, అతి భారీ వర్షాలు పడితే తప్ప ముంపు సమస్య ఉండదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ, తపోవన్ కాలనీ, సాయినగర్ కాలనీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఒక్కటొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. గతంలో చిన్నపాటి వర్షానికే లింగోజిగూడ ముంపునకు గురయ్యేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సాయినగర్ కాలనీలో నిర్మించిన నాలా పనులకు ఉచితంగా స్థలాలు ఇచ్చిన కాలనీవాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎన్‌డీపీ పనులలో కొంత మేర ఆలస్యం జరిగిందని, త్వరలో పనులు పూర్తవుతాయన్నారు. వర్షాకాలంలో చెరువు నుంచి ఎప్పటికప్పుడు నీటిని కిందికి వదిలేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారపు శ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు కై లాష్ రెడ్డి, బాల్‌రెడ్డి, ప్రసాద్, బస్వరాజ్, అయిలయ్య, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిటీ 'గ్రేటర్' కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు భరత్ రాజ్



ప్రధాన కార్యదర్శి సంపత్

దిల్‌సుఖ్‌నగర్: జాతీయ మానవ హక్కుల కమిటీ గ్రేటర్ హైదరాబాద్ శాఖ అధ్యక్షుడిగా లయన్ వల్లెం భరత్ రాజ్, గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా లయన్ నాగసాయి సంపత్ ఎన్నికయ్యారు. జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సి) నేషనల్ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ యాసిన్ ఆదేశాల మేరకు గ్రేటర్ కార్యవర్గం ఎన్నికలు ఇన్‌చార్జ్ కేశమోని యాదయ్య గౌడ్ అధ్యక్షతన శుక్రవారం ఆర్‌కేపురంలో నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా లయన్ వల్లెం భరత్ రాజ్, కార్యదర్శిగా లయన్ నాగసాయి సంపత్, గౌరవ సలహాదారుగా కేశమోని యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులుగా గట్టుపల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా లయన్ మురళీ మనోహర్, సగిలి సుబ్బారెడ్డి, నిడదవోలు వీర రాజు, ప్రచార కార్యదర్శిగా జి.సంతోష్ యాదవ్‌ను ఎన్నికున్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాటి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపల్లి పరమేశ్వర్, రాష్ట్ర సలహాదారు రమేష్ పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై ప్రచారం



విద్యార్థులతో కలిసి వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న చేకోలేకర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

మలక్‌పేట: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో భాగంగా చేపడుతున్న ఈనెల 18న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేటలోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో శుక్రవారం క్విజ్ పోటీలపై ప్రచారం చేశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొనాలని కోరారు. విద్యార్థులతో కలిసి 'ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 17 తేదీలోగా తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్ పొందడానికి ఆసక్తి కలిగిన వారు 7661 899 899 సెల్ నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాయిరామ్, శివ, మనీష్, అనిరుద్, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మలక్‌పేట: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే బలాల అన్నారు. నియోజవర్గ పరిధిలోని అక్బర్‌బాగ్, అజంపుర, సైదాబాద్, చావుని, ఓల్డ్‌మలక్‌పేట, మూసారంబాగ్ డివిజన్ల పరిధికి చెందిన 12 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు ఉన్నారు.

చోరీకి వచ్చి స్థానికులకు చిక్కాడు!

చంచల్‌గూడ: అర్ధరాత్రి వేళ ఇంట్లో చొరబడి చోరీకి యత్నించిన దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గురువారం అర్ధరాత్రి మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ జానయ్య తెలిపిన వివరాల ప్రకారం... మాదన్నపేట బోయ బస్తీలో నివాసం ఉండే రాచూరి శ్రీకాంత్ ఇంట్లోకి గురువారం అర్ధరాత్రి పక్క భవనం మీదుగా ఓ యువకుడు వీరింట్లోకి దూకి చోరీకి యత్నించాడు. ఇది గమనించిన శ్రీకాంత్ కుటుంబసభ్యులు పెద్దగా అరవడంతో అప్రమత్తమైన స్థానికులు అతడిని పట్టుకున్నారు. ఇదిలా ఉండగా స్థానికంగా ఉండే గౌస్ అనే యువకుడే చోరీకి యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే భూమి ఇద్దరికి విక్రయం

- ఏడుగురు నిందితులకు మూడేళ్ల జైలు విధించిన కోర్టు

హయత్‌నగర్: పట్టాదారులతో కుమ్మక్కై అమ్మిన భూమినే మరోసారి వేరొకరికి అమ్మి మోసగించిన ఏడుగురికి మూడేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం హయత్‌నగర్ కోర్టు తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... మలక్‌పేట తిరుమల హిల్స్‌కు చెందిన జి.జయకు కోహెడాకు చెందిన గుండ్ల వేంకటేష్‌తో పరిచయం ఉంది. ఆమె తాను భూమి కొంటానని, మంచి భూమిని ఇప్పించమని అడిగింది. ఇదే అదనుగా భావించిన వెంకటేష్ ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడకు చెందిన దూస రంగయ్య, బుగ్గరాములు, లింగంకు చెందిన కోహెడాలోని సర్వే నం .648లో 3.7 ఎకరాల భూమిని చూపించారు. రూ. 35 లక్షలకు మొత్తం కొనేందుకు ఒప్పందం జరిగింది. దీంతో 2006 జనవరి 7న రూ.17 లక్షలు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ సమయంలో శేరిగూడకు చెందిన తాళ్లపల్లి సుధాకర్, కొహెడాకు చెందిన కళ్లెం సుధాకర్‌రెడ్డి, ఉప్పరిగూడకు చెందిన వరద రంగయ్య మధ్యవర్తులుగా వ్యవహరించారు. 21 జనవరి 2006న జయ, ఆమె కొడుకు కిషోర్‌కుమార్ పేరుతో పట్టాదారులు రిజిస్ట్రేషన్ చేశారు. కాగా 2007 నవంబర్‌లో భూమి వద్దకు వెళ్లగా ఇతరులు పొజిషన్‌లో ఉన్నారు. ఆరా తీయగా వీరికంటే నెల రోజుల ముందే వాసుదేవరెడ్డి అనే వ్యక్తికి ఈ భూమిని విక్రయించినట్లు తేలింది. దీంతో మోస పోయినట్లు గ్రహించి జయ తన డబ్బును తనకు ఇవ్వాలని కోరింది. డబ్బు ఇవ్వక పోవడంతో ఆమె హయత్‌నగర్ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని హయత్‌నగర్ పోలీసులను కోర్టు ఆదేశించింది. కేసు నమోదు చేసిన పోలీసులు గుండ్ల వెంకటేశ్, తాళ్లపల్లి సుధాకర్, కళ్లెం సుధాకర్‌రెడ్డి, వర్ద రంగయ్య, దూస రంగయ్య, దూస బుగ్గరాములు, దూస లింగంలను దోషులుగా తేల్చారు. ఈ మేరకు పోలీసులు కోర్టుకు సాక్ష్యాధారాలను సమర్పించగా కోర్టు పైవిధంగా తీర్పు ఇచ్చింది.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తి కావడమేకాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీరామ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీవాసులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతా నాయక్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి డివిజన్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి దశరథరామ్‌రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌రాజ్, రవీందర్‌నాయక్, నాయకులు ఎరుకల మల్లేశ్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, మమత, శేఖర్ పాల్గొన్నారు.

అంచెలంచెలుగా కాలనీల అభివృద్ధి

ఎల్‌బీనగర్: అంచెలంచెలుగా డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వైదేహినగర్‌లో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ డీఈ దామోదర్‌రావుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీలోని సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణన్, కృష్ణారెడ్డి, జంగారెడ్డి, నాయకులు ముత్యాలు, ప్రకాష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: సమాజ బలోపేతానికి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శుక్రవారం అక్బర్‌బాగ్‌లోని కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ ట్రైనింగ్ అండ్ ప్రొడక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమవేశంలో ఆయన మాట్లాడుతూ, మలక్‌పేట నియోజకవర్గంలోని అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అక్బర్‌బాగ్ కార్పొరేటర్ మినాజుద్దీన్, ఎంఎఫ్‌సీ చైర్మన్ ఇంతియాజ్ ఇషాక్, మలక్‌పేట ఎంఐఎం ఇన్‌చార్జ్ రహ్మతుల్ తయ్యాబ్, మహిళా ఇన్‌చార్జ్ నజీమ పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి: సీపీఐ

సైదాబాద్: ప్రజాసమస్యల పరిష్కరానికి సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ పార్టీ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. శుక్రవారం సింగరేణి కాలనీలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ ప్రజాగర్జన వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా షేక్ మహమూద్ మాట్లాడుతూ, దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పలు ప్రజాసమస్యల పరిష్కారం, రాజ్యాంగ లౌకిక వ్యవస్థల పరిరక్షణ కోసం సీపీఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 11న కొత్తగూడంలో బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయలని ఆయన కోరారు.

సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో ఉన్నాయని, సంక్షేమంలో నంబర్‌వన్‌గా ఉన్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ చింతలకుంటలోని ప్రలవి గార్డెన్స్‌లో తెలంగాణ సంక్షేమ సంబురాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, యెగ్గే మల్లేషంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి రోల్‌మోడల్ చేయడానికి సీఎం కేసీఆర్ ఒక విజన్‌తో ముందుకెళ్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలకులకు భిన్నంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, 11 రకాల పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. 2014కు ముందు ఎల్‌బీనగర్‌లో 7458 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, నేడు ఈ సంఖ్య 24 వేలకు చేరిందన్నారు. విద్య, వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. గత తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని చేసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 100 మందికి దళితబంధు పథకం కింద రూ.10 కోట్లు కేటాయించామని, మరో రెండు, మూడు రోజుల్లో 1100 మందికి.. ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పులన దళిత బంధు కింద అందజేయనున్నామన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, ఆసరా పింఛన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీదివాకర్, హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, జలమండలి జీఎం వినోద్, హయత్‌నగర్ సర్కిల్ యూసీడీ అధికారి బలరామ్, బీసీ వెల్ఫేర్ అధికారులు మమత, కృష్ణవేణి, రాకేష్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది: కొప్పుల

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దశాబ్ది ఉత్సవాలపై ఉన్న శ్రద్ధ నోటిఫైడ్ స్లమ్‌ల్లో నివసిస్తున్న ప్రజల సమస్యల పరిష్కారంపై లేదని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ధ్వజమెత్తారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని షిరిడీ సాయినగర్‌కాలనీ వీరన్నగుట్ట)వాసులు 59 జీఓతో పడుతున్న ఇబ్బందులపై హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎన్టీరామారావు, చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఇచ్చిన ప్రభుత్వ పట్టాలు నేడు చెల్లవంటూ కొత్తగా 59 జీఓను తీసుకువచ్చి పేదలపై భారం వేశారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి లక్షల రూపాయాలు చెల్లించాలని నోటీసులు అందజేసి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫైడ్ స్లమ్‌లో 10 శాతం మాత్రమే రుసుము వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, 58 జీఓ ప్రకారంగా అవకాశం ఇవ్వాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. అలాగే, డివిజన్ పరిధిలోని చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు అన్యక్రాంతం అవుతున్నాయని, కబ్జాల నివారణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరామని కార్పొరేటర్ నర్సింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో బస్తీ వాసులు సత్తయ్య, కోటయ్య, నాగమణి, మహాలక్ష్మి, మదనయ్య, దశరథ, మంగయ్య, అంజయ్య, డా.నర్సింహ్మా, రమేష్, రామకృష్ణ, నాయకులు కడారి యాదగిరియాదవ్, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.

